క్లుప్తంగా

కులగణన చేపట్టండి

తుర్కయంజాల్: కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు రావుల కోల్ నరేష్ కోరారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఓబీసీల మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, వెంటనే కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎంపీపీ కొప్పు సుకన్య



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సుకన్య

యాచారం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. యాచారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణలో ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఎంపీపీ మాట్లాడుతూ... పరిసరాల పరిశుభ్రతపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ విషయమై తల్లితండ్రుల్లో చైతన్యం కల్పించాలన్నారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస కాలనీకి చెందిన జంగమ్మ గురువారం మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యుడు జగన్ పరామర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3 వేలను మృతురాలి కుటుంబానికి జగన్ అందించారు. స్థానిక నాయకులు మల్లయ్య, దేవేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రత్యేకాధికారి ఇంద్రసేనారెడ్డి



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఇంద్రసేనారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇబ్రహీంపట్నం మండల పంచాయతీరాజ్ ఇంజనీర్, ఉప్పరిగూడ, పోచారం గ్రామాల ప్రత్యేకాధికారి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం, ఉప్పరిగూడ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరంతరం చెత్త సేకరణ చేపట్టాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించలన్నారు. పంచాయతీ కార్యదర్శి రిషిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్



పీఆర్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న పరమేశ్

ఇబ్రహీంపట్నం: పీఆర్టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు పరకాల పరమేశ్ పీఆర్టీయూ జెండాను ఆవిష్కరించిన అనంతరం సంఘ వ్యవస్థాపకుడు సామల యాదగిరి చిత్రపటానికి నివాళి అర్పించారు. పరమేశ్ మాట్లాడుతూ.. 1971 ఫిబ్రవరి 9న సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటినుంచి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ముందుండి పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజు, నారాయణరెడ్డి, ఆనంద్‌కుమార్, బీరప్ప, నర్సింహ, గోవర్ధన్, హరిప్రసాద్, రవీందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు వేళాయె

- 14 నుంచి శెట్టిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ వేడుకలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ
- మూడురోజులపాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ఆమనగల్లు: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో వెలసిన శ్రీ అలివేలు మంగాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రతి ఏటా ఐదురోజుల పాటు అత్యంత వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. కల్వకుర్తి ప్రాంతంలో ప్రారంభమయ్యే తొలి బ్రహ్మోత్సవాలు ఇవే కా వ డం విశేషం. ఈ ఉత్సవాల కోసం ప్రస్తుతం ఆల యం ముస్తాబవుతోంది. ఉత్సవాలకు సంబంధించి న ఏర్పాట్లను గ్రామ మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, ఆల య వ్యవస్థాపక ట్రస్టీ జగన్మోహన్ పర్యవేక్షిస్తున్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. బాలురు, బాలికల విభాగం, స్కూల్ విద్యార్థుల విభాగంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. మొద టి, రెండవ బహుమతితో పాటు షీల్డులు కూడా అందిచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనాలని కోరారు

రాష్ట్ర నలుమూలల నుంచి..

ఈ ఉత్సవాలకు కేవలం జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలనుంచి భక్తులు తరలివస్తుంటారు. ఇక్కడ కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఉత్సవాలకు పెద్దెత్తున ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



శెట్టిపల్లిలో నిర్వహించే బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయం చుట్టూ చలువ పందిర్లు వేస్తున్నాం. భక్తులకు ఐదు రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తాం. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో అందరి సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నాం.

– గోదాదేవి సత్యం, మాజీ సర్పంచ్, శెట్టిపల్లి

తోటివారికి సహాయం అందించాలి

మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న శ్రీనివాస్‌యాదవ్, మత గురువులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌లో మౌలా అలీ హజ్రత్ షా ఖలందర్ బాబా దర్గా ఉర్సు గత మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. శుక్రవారం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ఉర్సులో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి శ్రీనివాస్ యాదవ్ రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తోటివారికి సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్, దర్గా ముతవల్లి మౌలానా అబ్దుల్ కరీం షా ఖాద్రి, మహ్మద్ అబ్దుల్ నయాం ఖాద్రి, మహ్మద్ అబ్దుల్ రహీంషా ఖాద్రి, ఫవాద్ ఉర్ రహ్మాన్ తయేవార్, ఫరూకీ ఇసాక్ అలీ, అలీమ్ హాజీబాబా, జాఫర్, నసీర్, దస్తగిరి, ఆరీఫ్, మహబూబ్ చాంద్ పాషా, మహ్మద్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సభ్యులు

మాడ్గుల: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడమే ఐక్యతా ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని అర్కపల్లి, అవురుపల్లి, కొలుకులపల్లి, నాగిళ్ల, మాడ్గుల ప్రభుత్వ పాఠశాలలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మెన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందించిన స్కాన్ అండ్ లెర్న్ పుస్తకాలను శుక్రవారం ఆ ఫౌండేషన్ సభ్యులు పంపిణీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాన్ అండ్ లెర్న్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించామన్నారు. పాఠ్య పుస్తకాల్లో ఉన్న పాఠాలను విభజించి ఒక్కో పాఠానికి క్యూఆర్‌కోడ్ రూపొందించి ఆ పాఠం యొక్క సారాంశం, క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వీడియోల రూపంలో విద్యార్థులకు అందుతుందని తెలిపారు. దీంతో విద్యార్థులు పాఠాలను సులభంగా అర్థం చేసుకోగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు.. మల్లయ్య, శివ, సుధాకర్, ఈరమల్ల శివ, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పదవికి మాత్రమే విరమణ.. సేవకు కాదు



మాజీ సర్పంచ్‌లను సత్కరించిన ఎంపీపీ పద్మారెడ్డి

మాడ్గుల: సర్పంచ్‌ల పదవికి మాత్రమే విరమణ.. తప్పా ప్రజాసేవకు కాదని మాడ్గుల ఎంపీపీ పద్మా రెడ్డి అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో శుక్రవారం రైతువేదిక హాల్‌లో ఎంపీపీ పద్మారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలో ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న సర్పంచ్‌లకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మా రెడ్డి మాట్లాడుతూ.. కరోనా కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి గ్రామాల్లో ప్రజలకు సేవలందించారని సర్పంచ్‌ల సేవలను అభినందించారు. అందరూ ఎంతో బాధ్యతగా తమ విధులను నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు జైపాల్ రెడ్డి, గ్యార చంటి, నారమ్మ, సర్పంచ్‌లు హన్మనాయక్ రాథోడ్, హంసీ, పద్మ యాదయ్య, జంగయ్య, జోజమ్మ, రూపాదేవి, పద్మ జగదీష్, ఉపసర్పంచ్ రాములు, ఎంపీడీఓ రాఘువులు, తహసీల్దార్ నిరంజన్ రావు, అధికారులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



ఎంపీఓకి సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

సీఐటీయూ కన్వీనర్ రాములు

ఇబ్రహీంపట్నం: ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మండల సీఐటీయూ కన్వీనర్ బుగ్గరాములు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీఓ లక్‌పతినాయక్‌కు శుక్రవారం ఆయన కార్మికులతో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ప్రమాద బీమా రూ.10లక్షలు కల్పించాలని, వారాంతపు సెలవులతోపాటు జాతీయ సెలవులను కార్మికులకు అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కోశాధికారి దేవదాసు, జిల్లా నాయకులు నరేష్, మల్లేష్, యాదయ్య, ఐలయ్య, రాజశేఖర్, బాల్‌రాజ్, కిషన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా మూసివేయాలి

తలకొండపల్లి: కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 16న నిర్వహించనున్న భారత బంద్‌ను విజయవంతం చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల (జీఎంపీఎస్) సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన తలకొండపల్లిలో మాట్లాడారు. 16న మండలంలో దుకాణదారులు స్వచ్ఛందంగా షాపులు మూసివేయాలని కోరారు. బంద్‌కు అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు.

గృహజ్యోతి నమోదుకు ప్రత్యేక కేంద్రం

ఆమనగల్లు విద్యుత్ ఏఈ సీతారాములు

ఆమనగల్లు: ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకంలో భాగంగా గృహ వినియోగదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆమనగల్లు విద్యుత్ ఏఈ సీతారాములు తెలిపారు. వినియోగదారుల ఇంటికి విద్యుత్ సిబ్బంది వచ్చినప్పుడు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ వివరాలు అందించి బిల్లింగ్ మెషీన్‌లో నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఇంటివద్ద వివరాలు నమోదు చేసుకోనివారి కోసం ప్రత్యేకంగా ఆమనగల్లు పట్టణంలోని గాంధీచౌక్ చౌరస్తాలో ఉన్న విద్యుత్ వినియోగదారుల కేంద్రంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఇంటికి వచ్చిన సమయంలో వివరాలు నమోదు చేసుకోనివారు ప్రత్యేక కేంద్రం వద్దకు వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని ఏఈ సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది గోపాల్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

న్యాయయాత్రలో మన నాయకులు

కడ్తాల్: పాలమూర్ ప్రగతే లక్ష్యంగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు డాక్టర్ చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన పాలమూర్ న్యాయయాత్రలో కడ్తాల్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. శుక్రవారం దేవరకద్ర నియోజకవర్గంలో సాగిన ప్రజా న్యాయయాత్రలో వంశీచంద్‌రెడ్డితో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎంపీటీసీ రాములుగౌడ్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, మాజీ సర్పంచ్‌లు నరేందర్, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాల్‌రాజ్, చెన్నయ్య, రమేశ్ నాయక్, పవన్ తదితరులు ఉన్నారు.

గ్రామాలకు వెళ్లాల్సిందే

- పారిశుద్ధ్యం, తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి
- ఆరు గ్యారంటీ పథకాల అమలుపై దృష్టి పెట్టాలి
- యాచారం ఎంపీడీఓ విజయలక్ష్మి



SAKSHI INTERVIEW

యాచారం: గ్రామ పంచాయతీలకు ఎంపికైన ప్రత్యేకాధికారులు నిత్యం గ్రామాలకు వెళ్లాల్సిందేనని.. పారిశుద్ధ్యం, తాగునీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలని యాచారం ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. గ్రామాల్లో ఉండే పంచాయతీ కార్యదర్శుల సహకారంతో సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆమె కోరారు. గ్రామాల్లో ప్రత్యేక పాలన, ఆరు గ్యారంటీ పథకాలు అమలుపై నిత్యం ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు, సూచనలు వస్తున్నాయని తెలిపారు. ఆ ఆదేశాలను ఫోన్ ద్వారా ప్రత్యేకాధికారులకు తెలియజేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేక పాలనపై శుక్రవారం ఆమె 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

సాక్షి: ప్రత్యేకాధికారులు నిత్యం గ్రామాలకు వెళ్తున్నారా?

ఎంపీడీఓ: వెళ్తున్నారు. నిత్యం గ్రామాలకు వెళ్తేనే ప్రజల సమస్యలు తెలుస్తాయి.

సాక్షి: గ్రామాల్లో ఏ సమస్యలను గుర్తించారు?

ఎంపీడీఓ: గ్రామాల్లో ప్రస్తుతం పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయడం, తాగునీటి పైపులు లీకేజీలు కాకుండా పర్యవేక్షించడం, రోడ్ల శుభ్రత తదితర పనులు చేయిస్తున్నాం. ప్రస్తుతానికైతే ఎలాంటి సమస్యలు లేవు.

సాక్షి: పంచాయతీల్లో నిధులు లేవని అంటున్నారు?

ఎంపీడీఓ: కొన్ని పంచాయతీల్లో నిధులు లేనిమాట వాస్తవమే. అత్యవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిధులు సమకూర్చి ప్రజల సమస్యలు తీరుస్తాం. ఇంటి పన్నులు వసూల్ చేసి ఎస్‌టీఓలో జమచేసి అవసరమైతే ఆ నిధులనే ఖర్చు చేస్తాం.

సాక్షి: కొన్ని పంచాయతీల్లోని మాజీ సర్పంచ్‌లకు రూ.లక్షలాది బిల్లులు ఇవ్వాల్సి ఉందని అంటున్నారు?

ఎంపీడీఓ: ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. మాజీ సర్పంచ్‌లు గ్రామాల్లో ఏఏ అభివృద్ధి పనులు చేశారు. ఎంబీ రికార్డులు చేశారా పరిశీలిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏమైనా నిధులు మంజూరైతే, నిధుల నిల్వను బట్టి చేసిన పనులను మరోసారి తనిఖీ చేసి బిల్లులు మంజూరు చేసేలా కృషిచేస్తాం.

సాక్షి: ప్రత్యేకాధికారులు ఫోన్లు ఎత్తడం లేదని ప్రజలు అంటున్నారు?

ఎంపీడీఓ: ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలపై ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలి. కొన్ని సమయాల్లో ప్రత్యేకాధికారులు జిల్లా ఉన్నతాధికారులు సమావేశాల్లో ఉంటారు. అలాంటప్పుడు పంచాయతీ కార్యదర్శులకు సమస్యలను తెలియజేయాలి.

సాక్షి: ఆరు గ్యారంటీ పథకాల అమలు ఎలా ఉంది?

ఎంపీడీఓ: ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రజాపాలనలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. ఆ దరఖాస్తులే ప్రామాణికంగా మారుతాయి. అర్హులైన పేదలు ఆందోళన చెందవద్దు.

మురుగు కాలువ పనులు చేపట్టండి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ప్రతిభానగర్ కాలనీలో మురుగు కాలువ పనులను చేపట్టాలని కాలనీవాసులు కోరారు. ప్రతిభానగర్ కాలనీలో శుక్రవారం కౌన్సిలర్ లక్ష్మణ్, కమిషనర్ శ్యాంసుందర్ పర్యటించారు. ప్రతిభానగర్ కాలనీలో నిర్మించాల్సిన భూగర్భ మురుగు కాలువ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఎన్నికల కోడ్ వల్ల మురుగు కాలువ పనులు నిలిపివేశామని త్వరలో ప్రారంభించి పూర్తిచేస్తామని కమిషనర్ శ్యాంసుందర్ వివరించారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

యాచారం: మండల పరిధిలోని చింతుల్లలో శుక్రవారం ఉదయం విద్యుత్ వైర్లు తెగి ఇళ్ల మధ్యన కాలనీ రోడ్డులో పడ్డాయి. గమనించిన గ్రామస్తులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చి సరఫరా నిలిపేయించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ తెగిపడిన వైర్లకు మరమ్మతులు చేయించి సరఫరాను పునరుద్ధరించారు. రెండు రోజుల క్రితం కూడా ఇదే గ్రామంలో ఓ వ్యవసాయ పొలం వద్ద 11 కేవీ వైర్లు తెగి త్రీఫేస్ వైర్లపై పడటంతో సమీపంలో ఉన్న వ్యవసాయ పొలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు, రైతులు గమనించి పరుగులు పెట్టి ప్రాణాలను కాపాడుకున్నారు.